RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 341 పేజీలు - 08 శుక్రవారం 31 అక్టోబర్ 2025


## పిల్లల ప్రాణాలతో చెలగాటమొద్దు: సజ్జన్నార్



తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 30: ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో హ్యాండిల్ పట్టుకొని ఓ ద్విచక్రవాహనదారుడు ప్రమాదకర రీతిలో పిల్లలను స్కూలుకు తీసుకెళ్లిన ఘటనపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పందించారు. గుడిమల్కాపూర్‌లో ఓ వ్యక్తి చిన్నారులను బైక్‌పై ప్రమాదకరంగా తీసుకెళ్తుండటంపై 'ప్రమాదమని తెలిసీ ప్రాణాలతో చెలగాటం ఆడడటంపై ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. ఇలా బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు పట్టు తప్పితే బాధ్యులెవరని ప్రశ్నించారు. వర్షంలోనూ పిల్లల చదువుపై ఉన్న శ్రద్ధ.. ట్రాఫిక్ రూల్స్ నేర్పించడంలో ఎందుకు ఉండడం లేదన్నారు. ఇలా ప్రమాదకర ప్రయాణం చేస్తూ చిన్నారుల ప్రాణాలతో చలగాటమాడొద్దని సూచించారు. ప్రజలంతా ఆలోచించాలని, ట్రాఫిక్ రూల్స్ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని ఈ సందర్భంగా సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.



## ఛాత్ పూజకు యునెస్కో గుర్తింపు తెస్తాం: ప్రధాని మోదీ

తొలి అక్షరం/ముజాఫర్‌పుర్:అక్టోబర్ 30: బీహారీ ప్రజలు గొప్పగా జరుపుకునే ఛాట్ పూజకు .. యునెస్కో వారసత్వ సంపద గుర్తింపు తీసుకురానున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇవాళ ముజాఫర్‌పుర్‌లో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఎంతో సంతోషంగా బీహారీ ప్రజలు ఛాట్ పూజను జరుపుకుంటారని, ఆ పండుగను కాంగ్రెస్ పార్టీ అవమానిస్తున్నదని, మిగతా2లో...

## రైతులకు వేదన మిగిల్చిన
# తుఫాన్



- అధికారులు క్షేత్రస్తాయిలో పర్యటించాలి
- నష్టాలను అంచనా వేసి వివరాలను తెలియచేయాలి
- విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి
- నేడు వరంగల్, హుస్నాబాద్‌లలో సిఎం పర్యటన

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 30:ఇది వరి కోతల కాలం.. కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం మిగతా2లో...

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా
# జస్టిస్ సూర్యకాంత్

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ విడుదల



2లో

## దక్షిణ కొరియా వేదికగా చైనా, అమెరికా నేతల భేటీ

జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా సాగింది

10శాతం టారిఫ్‌లను తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటన



తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 30: అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ ఇరు దేశాల అధినేతలు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ గురువారం భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమైన వీరు పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. మిగతా2లో...

## చంద్రబాబు ముందస్తు చర్యలతో
# నష్టనివారణ

- 46 వేల హెక్టార్లలో వరికి నష్టం కలిగింది
- 14 వేల హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- కృష్ణాజిల్లా అవనిగడ్డలో పర్యటించిన డిప్యూటి సిఎం
- బాధిత రైతులతో మాట్లాడి భరోసా ఇచ్చిన పవన్ కళ్యాణ్





తొలి అక్షరం/విజయవాడ,అక్టోబర్ 30: ముందస్తుగా తీసుకున్న చర్యలతో తుఫాన్ నష్ట నివారణ కొంత వరకు తగ్గించగలిగామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని.. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేసిందని కొనియాడారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో మిగతా2లో...

# అజారుద్దీన్ ఎందుకీ అక్కసు

- బిజెపి తీరుపై మండిపడ్డ కాంగ్రెస్
- దేశానికి కీర్తి తెచ్చిన ఘనత అజ్జాదన్న భట్టి
- బిజెపి విమర్శలను కొట్టి పారేసిన పిసిసి చీఫ్



తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 30: మంత్రి వర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ భాజపా నేతలు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో)ను ఆశ్రయించడాన్ని కాంగ్రెస్ నేతలు ఖండించారు. ఇందులో అజారుద్దీన్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించవద్దనే కుట్ర కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. అజారుద్దీన్ హైదరాబాద్ బిడ్డ అని, మన కీర్తిపతాకలను రెపరెపలాడించిన వ్యక్తి అని పేర్కొన్నారు. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవద్దని లేఖలు రాస్తున్నారు. దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన క్రీడాకారుడని అన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచపటంలో మిగతా2లో...



## నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

- అజారుద్దీన్ కోసం ప్రత్యేకం
- రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 30: తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ మిగతా2లో...

## జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి

- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఘాటు విమర్శలు




తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 30: జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక కోసమే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహిస్తున్నట్లు కనిపిస్తున్నదని చెప్పారు. అందుకే పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి మిగతా2లో...

## వరంగల్ ముంపు ప్రాంతాల్లో
# పోలీస్ సేవలు



- హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను పంపించండి
- తక్షణ సహాయక చర్యలకు పడవలను పంపించాలి
- వరదల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల సాయంతో ఆహారం
- సీఎస్, డీజీపీకి ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 30: వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్య ంలో పోలీసుల సేవలను వినియోగించు కోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి



హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న మిగతా2లో...

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- పంట నష్టపోయిన ప్రాంతాల్లో మంత్రి పొన్నం పర్యటన



తొలి అక్షరం/సిద్దిపేట,అక్టోబర్ 30: సిద్దిపేట జిల్లా కోహెడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పర్యటించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. మిగతా2లో...

# దక్షిణ కొరియా వేదికగా చైనా, అమెరికా నేతల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. జిన్‌పింగ్ తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి దక్షిణకొరియాలోని బూసాన్ నగరంలో గల అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వేదికైంది. విమానాశ్రయంలో వీరిద్దరూ సమావేశమవడంపై కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, షెడ్యూల్ కారణాల వల్లే మీటింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ట్రంప్ బుధవారమే దక్షిణకొరియా నుంచి వెళ్లిపోవాల్సింది. దానికంటే ముందు నిన్న సాయంత్రం జిన్‌పింగ్‌తో భేటీ అవ్వాలని అమెరికా అధ్యక్షుడు భావించారు. సమయాభావం కారణంగా సమావేశాన్ని గురువారం ఉదయానికి మార్చారు. చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంతో.. ఎయిర్‌పోర్టులోనే భేటీకి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం దక్షిణ కొరియా నుంచి ట్రంప్ వెళ్లిపోయారు. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57శాతం నుంచి 47శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ వెల్లడించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ ఖనిజాలను ఏడాది పాటు అగ్రరాజ్యానికి ఎగుమతి చేసేలా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ అరుదైన ఖనిజాల కారణంగానే ఇటీవల ట్రంప్ చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. తాజా డీల్‌తో బీజింగ్‌కు ఊరట లభించినట్లయ్యింది. ఇక చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడిపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం నా అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని వెల్లడించారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారని అన్నారు.

# రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాల న్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై బ్రిడ్జిలు, లోలెవల్ కాజ్‌వేల వద్ద వరద నీరు నిలిచినా, రోడ్లు దెబ్బతిన్నా.. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్ ఎ÷-లో, అవుట్ ఎ÷-లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అజారుద్దీన్ ఎందుకీ అక్కసు

(మొదటి పేజీ తరువాయి)

నిలబెట్టారు. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటే ఎవరైనా స్వాగతించాలి. కానీ.. మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖ రాయడం దురదృష్టకరం అంటూ విమర్శించారు. భారత రాష్ట్ర సమితిని గెలిపించడంలో భాగంగానే భాజపా నేతలు లేఖ రాశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాజపాకు భారాస సహకరించింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భాజపా ఎలాగూ గెలవదు కాబట్టి బలహీన వ్యక్తిని నిలబెట్టింది. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోకుండా గవర్నర్‌పైనా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో అన్నారు. ఇంతకన్నా దారుణం ఏముంటుందన్నారు. మైనార్టీలకు బిజెపి వ్యతిరేకమని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు.నాడు భారత క్రికెట్ జట్టుకు అజారుద్దీన్ సేవలందించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్‌లోకి తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మైనార్టీకి అవకాశమిస్తే అడ్డుతగిలేలా విషం వెళ్లగక్కుతున్నారు. ఈసీ వద్ద ఆపాలని భాజపా నేతలు ప్రయత్నిస్తున్నారు. గొప్ప క్రీడాకారుడికి మంత్రివర్గంలో అవకాశం వస్తుంటే అనైతికంగా అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. మైనార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో కేబినెట్‌లో అవకాశం ఆలస్యమైంది. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా మైనార్టీలకు సంక్షేమానికి పాటుపడుతున్నాం. భాజపా ద్వంద్వ వైఖరిని ప్రజలు తెలుసుకోవాలి. ఎన్నికల వేళ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. రాజస్థాన్‌లో ఉపఎన్నిక వేళ భాజపా అభ్యర్థిని మంత్రిగా చేశారు. భాజపాకు రాజస్థాన్‌లో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఉంటుందా అని పిసిసి చీఫ్ ప్రశ్నించారు. అజారుద్దిన్‌ను కేబినేట్‌లోకి తీసుకుంటే బిజెపికి వచ్చిన నొప్పి ఏంటని మంత్రి పొన్నం అన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్‌లవి ద్వంద్వ నీతి అని ఎద్దేవాచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయన్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారు అంటూ ఫైర్ అయ్యారు పాయల్ శంకర్.

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)



పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులతో మాట్లాడారు. మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ మూడు జిల్లాల పరిధిలో ఉందని.. పూర్తిగా జలమయం అయిందని తెలిపారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నదని.. కొట్టుకుపోయిందని అన్నారు. వర్షాలకు రోడ్లు మొత్తం దెబ్బతిన్నాయని చెప్పారు. ఇప్పుడే ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని.. హుస్నాబాద్ లో పర్యటిం చాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశామన్నారు. రైతుల ను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాలకు అతీతంగా రైతాంగా న్ని ఆదుకోవాలని.. ఇక్కడ పర్యటించాలన్నారు. కేంద్రం సహకారం తీసుకొని బాధ్యతగా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు ప్రజల మధ్యే ఉండి నష్టపోయిన పంటలను అంచనా వేయాలని, భారీ వరదలకు జరిగిన నష్టాన్ని మొత్తం రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?

## • రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ బండి



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 30:** ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, సిబ్బంది ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 6 గ్యారంటీలు ఇస్తామని ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏం చేయాలి? మాట తప్పిన కాంగ్రెస్ నేతలపై విజిలెన్స్ దాడులు చేస్తారా? ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 15 లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నా సోయి లేదా? అని ప్రశ్నించారు. సర్టిఫికెట్లు రాక, ఉద్యోగాల్లో చేరలేక, ఉన్నత చదువులకు వెళ్లలేక విద్యార్థులు ఆందోళన పడుతున్నరన్నారు. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే విద్యా సంస్థలు నడిచేదెలా? అధ్యాపకులకు జీతభత్యాలు, అ÷-దదె, మెయింటెనెన్స్ ఛార్జీలు చెల్లించేదెలా? అని నిలదీశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ పథకానికి తూట్లు పొడుస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఫీజు బకాయిల కోసం ఎందాకైనా పోరాడాన్నారు. కాలేజీలు, విద్యార్థుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు.

# ఛాత్ పూజకు యునెస్కో గుర్తింపు తెస్తాం: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

కానీ తమ ప్రభుత్వం ఛాట్ పూజకు యునెస్కో గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తునదన్నారు. ఓట్ల కోసం ఛాట్ ఉత్సవాన్ని కాంగ్రెస్, ఆర్జేడీ అవమానిస్తున్నదన్నారు. రైల్వేను లూటీ చేసినవాళ్లు.. బీహార్ ప్రాంతాన్ని ఎలా డెవలప్ చేస్తారని అన్నారు. బీహార్‌లో జంగిల్‌రాజ్ నడిచిందని, ఆర్జేడీ గుండాలు షోరూమ్‌లకు వెళ్లి వాహనాలను ఎత్తుకెళ్లినట్లు ఆరోపించారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు. అయితే సుప్రీంకోర్టులో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బాధ్యతలు చేపట్టనున్న ఆయకు హృదయపూర్వక అభినందలు, శుభాకాంక్షలు తెలిపారు.

# చంద్రబాబు ముందస్తు చర్యలతో నష్టనివారణ

(మొదటి పేజీ తరువాయి)

మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు.కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో పర్యటించారు. 'మొంథా' తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా ఉన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తం గా పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... మొంథా తుపాను ప్రభావంతో 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బ తిన్నాయని వెల్లడించారు. చెట్టు మీద పడి కోయ సుబ్బారావు అనే వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని అన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తున్నామని చెప్పారు. డ్రైన్ల పూడికతీతల ద్వారా నీరు నిల్వ లేకుండా చేశామన్నారు. ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నేడు నష్టం చాలా వరకు తగ్గిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆక్వా రైతుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని.. సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామన్నారు. రెండు రోజుల్లో మొత్తం చెత్తను క్లీన్ చేసేలా వేలాది మంది సిబ్బంది పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# వరంగల్ ముంపు ప్రాంతాల్లో పోలీస్ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మొంథా తుపాను వరంగల్ జిల్లాను ముంచెత్తింది. భారీ వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో జిల్లాలో వరదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని అన్నారు. వరంగల్ జిల్లాకు వెళ్లనున్న సీఎం... వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. కాగా.. వరంగల్ నగరాన్ని మొంథా తుపాను అతలాకుతలం చేసింది. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. అనేక ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరంగల్ నగరంలోని 30 ముంపు కాలనీలతో పాటు హనుమకొండలోని 15 ముంపు కాలనీవాసులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు డిజాస్టర్ సిబ్బంది తరలించింది. మొత్తం 1200 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రేటర్ పరిధిలో ఏడు ప్రత్యేక బృందాలను వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ ఏర్పాటు చేసింది. ఏడు బృందాల ద్వారా సహాయ చర్యలను సిబ్బంది చేపట్టింది.

# నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. 22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదవులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తనకు హామీ ఇచ్చి పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నా ఆయనకు మాత్రం అవకాశం దక్కకపోవడం గమనార్హం.

# జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి

(మొదటి పేజీ తరువాయి)

అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతున్నదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తుందన్నారు. అందుకే కాంగ్రెస్, దాని నాయకత్వానికి గుణపాఠం చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సరైన వేదిక అని చెప్పారు. ఈమేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

# వరిపంట నీట మునిగి నాశనం - కౌలు రైతు కళ్లలో నీరు, పొలాల్లో వేదన!

**"మా కష్టం పోయింది... యజమానికి డబ్బులు ఇవ్వాలి... మేము ఎలా బతకాలి?"**

**చిన్ననాగారం రైతు గుండ్ల నరసయ్య ఆవేదన**

**రెండు ఎకరాల వరిపంట పూర్తిగా నీటమునిగిన చిన్ననాగారం రైతు గుండ్ల నరసయ్య**

**కౌలు రైతు - పంట పోయినా యజమానికి డబ్బులు మాత్రం ఇవ్వాల్సిందే**

**మేము పట్టుబడి పెట్టాం, కానీ పంటతో పాటు ఆశలు కూడా మట్టిలో కలిశాయి"**

**ఎకరాకు రూ.30వేల ఆర్థిక సాయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి**

**ఇనుగుర్తి మండలంలోని రైతులందరూ అదే వేదనలో...**



**తొలి అక్షరం/ఇనుగుర్తి అక్టోబర్ 30:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం గ్రామానికి చెందిన కౌలు రైతు గుండ్ల నరసయ్య హృదయాన్ని కలచివేసే వేదన వ్యక్తం చేశారు. రెండు ఎకరాల వరిపంటను ఎంతో శ్రమతో సాగు చేశానని, కానీ గత రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా పంట పూర్తిగా నీట మునిగి నాశనం అయిందని తెలిపారు. ఆయన మాట్లాడుతూ ం "మేము కౌలు రైతులం. పంట పండకపోయినా యజమానికి డబ్బులు మాత్రం తప్పనిసరిగా ఇవ్వాలి. మేము పట్టుబడి పెట్టాం, ఎరువులు, విత్తనాలు అన్నీ అప్పు చేసి పెట్టాం. ఇప్పుడు పంట లేదు, ఆదాయం లేదు... యజమాని డబ్బులు కూడా ఇవ్వాలి... మా పరిస్థితి ఎవరు చూస్తారు? మేము ఎలా బతకాలి?" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎకరాకు రూ.30,000 ఆర్థిక సాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రభుత్వం మా వేదనను వినాలి. అధికారులు గ్రామాలకు వచ్చి పంట నష్టం అంచనా వేయాలి. లేకపోతే కౌలు రైతులు అప్పుల బారిన పడి దిక్కుతోచని స్థితిలో పడిపోతారు," అని గుండ్ల నరసయ్య విజ్ఞప్తి చేశారు. చిన్ననాగారం గ్రామంతో పాటు ఇనుగుర్తి మండలంలోని అనేక ప్రాంతాల్లో కూడా వర్షం కారణంగా పంటలు నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వరి పొలాలు నీటమునిగి కూలిన కష్టానికి చెల్లింపులు లేకపోవడం రైతుల జీవనోపాధిపై పెద్ద దెబ్బగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు.

# ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

- **జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి అజయ్ సారథి రెడ్డి, రేషపల్లి నవీన్ పిలుపు**





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 30:** ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి అజయ్ సారథి రెడ్డి, రేషపల్లి నవీన్ లు పిలుపునిచ్చారు. 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించి నాటినుండి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం అనునిత్యం ఉద్యమిస్తున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం అక్టోబర్ 31 నేడు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు వందలాదిమంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తారు. ఈ దేశంలో స్వాతంత్రానికి ముందు ఆవిర్భవించి దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అనునిత్యం పోరాటం చేస్తున్న ఏకైక సంఘం ఏఐటియుసి అని పిలుపునిచ్చారు కార్మికులకు భద్రత కార్మిక సంక్షేమ బోర్డు సంఘటితరంగా అసంఘటితరంగా కార్మికుల హక్కుల కోసం యాజమానుల దగ్గర నిరంతరం పోరాడుతూ ఉద్యమిస్తూ ముందుకు పోతున్న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు 4 లేబర్ కోడ్ లను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి అన్నారు కనీస వేతనం 26వేల రూపాయలు కార్మికులకు ఇవ్వాలన్నారు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏఐటిసి ఆధ్వర్యంలో కార్మికుల కోసం వారి హక్కుల కోసం ఉద్యమిస్తున్నామన్నారు ఏఐటియుసి పోరాటాలు కు ఆకర్షితులై అంగన్వాడి టీచర్లు ఆశా వర్కర్లు ఇతర కార్మికులు ఏఐటీసీలో చేరుతున్నారన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యాలతో కొట్లాడి కార్మికులకు రేట్లు పెంచుతున్నామన్నారు ముఖ్యంగా వీధి వ్యాపారుల కోసం గుంచి దారుల కోసం అనేక పోరాటాలు వారి పక్షాన చేశామన్నారు భవిష్యత్తులో ఏఐటియుసి కార్మికులకు అండగా ఉంటుందన్నారు రేపు జరిగే ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని వందలాది మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- **ప్రతి ఎకరాకు 25000 నష్ట పరిహారం చెల్లించాలి**
- **తహశీల్దార్ మహేందర్ గారికి వినతి పత్రం అందించిన బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య**





**తొలి అక్షరం/పెద్దవంగర అక్టోబర్ 30:** పెద్దవంగర మండలం లోని తహసీల్దార్ కార్యలాయములో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఈదురు ఐలయ్య తో పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రయ్య శర్మ తో కలిసి తహసీల్దార్ మహేందర్ కి వినతిపత్రం అందించిన అనంతరం వారు మాట్లాడుతూ మొంతా తుఫాన్ ప్రభావంతో కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు వర్షాలకు నష్టం జరిగిన పంటలను పరిశీలించి అధికారులు ప్రభుత్వం నష్టనివరణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇట్టి వర్షాలకు మండల పరిధిలోని పత్తి,వరి, మొక్కజొన్న,మిరప పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్ట పోయి పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు కావున ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారులతో క్షేత్ర స్థాయి పరిశీలన జరిపించి జరిగిన నష్టానికి తగిన పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, శ్రీరాం సంజయ్,కనుకుంట్ల వెంకన్న,సల్దండి సుధాకర్,కొండపెల్లి విజయ్ పాల్ రెడ్డి, బొమ్మిడి కృష్ణ రెడ్డి,పెరుగు మహిపాల్ రెడ్డి,చిలుక భిక్షపతి,ఎర్ర వెంకన్న,గద్దల వెంకన్న,జాటోతు శంకర్,రాంపాక నారాయణ, బొల్లు సతీష్,సంగని శేఖర్,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# రైతు కష్టం మునిగితే - ప్రభుత్వం మౌనంగా ఎందుకు?" కసిరబోయిన విజయ్ యాదవ్!

**వర్షాల విపత్తుతో పంటలు మునిగిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో...**

**"రైతు బాధ చూడని ప్రభుత్వం రైతు పాలన కాదు!" - విజయ్ యాదవ్ ఆవేదన**

**వ్యవసాయ అధికారులతో తక్షణ సర్వేలు చేపట్టాలని స్పష్టమైన విజ్ఞప్తి**

**నీటమునిగిన పంటలకు ఎకరాకు ?50,000 పరిహారం ఇవ్వాలని డిమాండ్**

**రైతులను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా బహుళ ఉద్యమాలకు సిద్ధమని హెచ్చరిక**



**తొలి అక్షరం/ఇనుగుర్తి అక్టోబర్ 30:** ఇనుగుర్తి మండలం చిన్న నాగారం గ్రామానికి చెందిన టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తోరూర్ ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ కసిరబోయిన విజయ్ యాదవ్ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతుల తరపున గళమెత్తారు. వర్షాల విపత్తుతో పంటలు నీటమునిగి మొలకెత్తిపోతున్నాయని, రైతులు ఆర్థికంగా కుప్పకూలుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ అధికారులతో సర్వేలు చేపట్టి, ప్రతి ఎకరాకు కనీసం ?50,000 చొప్పున నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. "రైతు చెమటతో ఈ భూమి పండగ జరుపుకుంటుంది%ొ% కానీ ఈరోజు ఆయన కన్నీరు చిందిస్తున్నాడు. ఆ కన్నీటిని తుడవడం ప్రభుత్వ ధర్మం" అంటూ విజయ్ యాదవ్ అన్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యం కొనసాగితే, రాష్ట్రవ్యాప్తంగా రైతు పక్షాన భారీ ఉద్యమాలు చేపడతామని ఆయన గట్టిగా హెచ్చరించారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేలో రైతుల ఆవేదన - పెద్ద కల్వర్టు నిర్మించాలి!

**కోమటిపల్లి రైతుల మనవి పత్రం గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులకు సమర్పణ**

**సర్వే నెంబర్ 159-100 రోడ్డుకింద ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు**

**అలుగునీరు పట్టక పొలాలు వరసగా మునుగుతున్నాయని రైతుల వాపోన**

**గత ఏడాది వర్షాల్లో పంటలన్నీ నష్టపోయాయని రైతులు గుర్తుచేశారు**

**అప్పట్లో అధికారుల సాయంతో జెసిపితో నీరు ఖాళీ చేసిన ఘటనను గుర్తు చేశారు**

**ఈసారి మళ్లీ 27 మే 2025న భారీ వర్షంతో 50 ఎకరాలు మునిగినట్లు తెలిపారు**

**పెద్ద కల్వర్టు నిర్మించి శాశ్వత పరిష్కారం చేయాలని విజ్ఞప్తి**

**"మా భూములు మా భవిష్యత్ .. వాటిని కాపాడండి" అని రైతుల వేడుకోలు**







**తొలి అక్షరం/ఇనుగుర్తి అక్టోబర్ 30:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామ రైతులు గ్రీన్ ఫీల్డ్ హైవే (ఎన్ .హెచ్. ఏ .పి. డి) అధికారులకు మనవి పత్రం సమర్పించారు. సర్వే నెంబర్ 159%-%100 రోడ్డు కింద ఉన్న పెద్ద చెరువు అలుగునీరు పట్టక, కింది పొలాలు ప్రతి సంవత్సరం మునుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు పంటలు నాశనం కావడంతో అప్పట్లో ఖమ్మం అధికారులు, గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు కలిసి జెసిపి తో గండి కొట్టి నీరు ఖాళీ చేసినప్పటికీ, శాశ్వత పరిష్కారం చేపట్టలేదని రైతులు తెలిపారు. ఇటీవల 27 మే 2025న కురిసిన భారీ వర్షంతో సుమారు 50 ఎకరాల పంట పొలాలు మళ్లీ మునిగాయని వారు పేర్కొన్నారు. అందుకే ఇప్పటికైనా రోడ్డు కింద ఉన్న కల్వర్టును పెద్దదిగా నిర్మించి, నీరు సాఫీగా వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని కోరారు. "మా పంటలు మా ప్రాణం%ొ% మా భూములు మా భవిష్యత్! దయచేసి వాటిని కాపాడండి" అంటూ గ్రీన్ ఫీల్డ్ హైవే కింద నష్టపోతున్న రైతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

# తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ మహబూబ్నగర్ జిల్లా కార్యవర్గ సమావేశం






**తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్ 30:** తెలంగాణ రాష్ట్ర టీచర్స ఫెడరేషన్ (టీ ఆర్ టీ ఎఫ్) ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకుల సమక్షంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ 80వ వసంతాల విద్యా సదస్సు స్ఫూర్తిగా రూపొందిన గోడపత్రికను రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ విడుదల చేశారు. నమావేశంలో ఉపాధ్యాయుల సంక్షేమం, సేవా నియమావళి, బదిలీలు, ప్రమోషన్లు, అర్హతలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ముఖ్యంగా 190 జీవో ప్రకారం తాత్కాలిక డిప్యూటేషన్లకు బదులుగా శాశ్వత మార్గదర్శకాలు రూపంలో స్పష్టమైన నిబంధనలు తీసుకురావాలన్న తీర్మానం ఆమోదించబడింది. అల్లా, సివిల్ సర్వీసు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో ఫెడరేషన్‌కు ఉన్న శాశ్వత హోదాతో భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణలో ముందుండాలని నిర్ణయించారు. అలాగే డి.ఏ., పి.ఆర్.సి., మెడికల్ బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయడం, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు తక్షణమే మంజూరు చేయాలన్న విజ్ఞప్తులు ప్రభుత్వానికి సమర్పించాలని తీర్మానించారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సమష్టిగా పనిచేయాలన్న పిలుపుతో సమావేశం ముగిసింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్, గౌరవ సలహాదారు కావాలి అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, నాయకులు భాస్కర్, యాదగిరి, స్వామి, రవీందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునగాల సతీష్ కుమార్ అధ్యక్షత వహించారు.

# మొంథా తుఫాన్ మరియు అకాల వర్షాల వలన పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

**- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి**



**తొలి అక్షరం/మాడుగుల పల్లి/అక్టోబర్ 30 :** మాడుగులపల్లి మండల కేంద్రంలోని పలు గ్రామాలలో అకాల వర్షానికి చేతికొచ్చిన పంట పొలాలు నేలకొరవడం జరిగింది . ఈ పొంట పొలాలని నేరుగా పరిశీలించిన సిపిఎం పార్టీ బృందం. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని మంత్రులు,ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టపోయిన పంటను అంచనా వేసి ఎకరానికి 30 వేల రూపాయలు నష్టపరిహారం వెంటనే ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దేవి రెడ్డి అశోక్ రెడ్డి సిపిఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ సిపిఎం మండల కమిటీ సభ్యులు జూకూరు నాగయ్య, పతాను శ్రీను, సిపిఎం కుక్కడం శాఖ కార్యదర్శి మునగాల నారాయణరెడ్డి , శాఖ సభ్యులు పండగ నాగయ్య, సీతారాం రెడ్డి రైతులు అలుగుబెల్లి గోవర్ధన్ రెడ్డి షేక్ జహంగీర్ పాల్గొన్నారు.

# అకాల భారీ వర్షాలకు నేలకొరిగిన వరి పంటను పరిశీలించిన డోర్నకల్ ఎమ్మెల్యే




**తొలి అక్షరం/మరిపెడ,అక్టోబర్ 30 :** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం దగ్గర వాగు ఉధృతని పరిశీలించిన డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి వాగు పరిసర ప్రాంత ప్రజలకు ఏమైనా ప్రమాదం గానీ ఇబ్బంది కలిగితే ప్రజలకు సహాయ సహకారాలు అందించాలి అని కోరారు అదేవిధంగా ఆయన వాగుపక్క సీతారాం తండాలో పర్యటించారు అనుకోకుండా కురిసిన అకాల వర్షాల వల్ల వాగులోని వరద ప్రవాహం ఎక్కువై బ్రిడ్జిని తాకుతూ ప్రవహించడం జరుగుతుంది అన్నారు కాబట్టి తండ ధర్మారం సీతారాం తండా వాగు పరిసర ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి అన్నారు ప్రభుత్వం సలహాలు సూచనలు తీసుకుంటూ ప్రజలందరూ అప్రమత్తంగా బయటికి రాకుండా జాగ్రత్త పడాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో వారి వెంట అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# కోటగుళ్ళు శిల్ప సంపద అద్భుతం

**- భూపాలపల్లి ఆర్డీవో రవి**

**- గణపేశ్వరుడికి ప్రత్యేక పూజలు**



**తొలి అక్షరం/గణపురం:** కాకతీయులు నిర్మించిన కోటగుళ్ళు శిల్ప సంపద ఎంతో అద్భుతమని భూపాలపల్లి ఆర్డీవో రవి అన్నారు. కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారి ఆలయాన్ని సందర్శించడం జరిగిందని కోటగుళ్ళు ఆలయం రామప్పను పోలిన విధంగా ఉందన్నారు. మరోసారి ఆలయాన్ని సందర్శిస్తానని అన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గణపురం తహసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి తదితరులు ఉన్నారు

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**• పెద్దవంగర పెద్ద చెర్వు మత్తడి ప్రవాహాన్ని పర్షిలించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**





**తొలి అక్షరం/పెద్దవంగర అక్టోబర్ 30:** మొంథ తుఫాన్ ప్రభావంతో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల తీవ్రతతో పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దవంగర మండల కేంద్రం నుండి ఉప్పరిగూడెం వైపుకు వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు పొంగి రహదారిపైకి ప్రవహించడం వల్ల వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి ఈ పరిస్థితి గురించి సమాచారం అందుకున్న పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజల భద్రత దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారిపై నీరు తగ్గే వరకు ఆ మార్గంలో ప్రయాణం చేయకూడదని ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణభద్రత మనకు అత్యంత ముఖ్యమైనది. అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజల భద్రత కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా నీరు ఎక్కువగా నిలిచిపోతే వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేయాలి. ఎవరూ అవసరం లేకుండా బయటకు రావద్దు. వర్షాలు కొనసాగుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి అని సూచించారు.అలాగే భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ శాఖ, పంచాయతీ, రోడ్డు , భవనాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వర్షపు నీరు ధాన్య కొనుగోలు కేంద్రాల్లోకి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు..ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఉంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందిస్తారు. ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంది అని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం లో తహసీల్దార్ మహేందర్, ఎంపీడీఓ వేణుమాధవ్, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్. ప్రధానకార్యదర్శి పొడిశెట్టి సైదులు. యూత్ అధ్యక్షులు బీస్ హరికృష్ణ. షతిషు. వేణు. బానోత్ వెంకన్న. బోనగిరి లింగమూర్తి. ఉమా. మహిళ అధ్యక్షులు చిలుక దేవేంద్ర. ఎస్టీ సెల్ అధ్యక్షులు సీతారామ్ నాయక్. బిసి సెల్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పంట నష్టాన్ని నివారించుటకు రైతులు తగు తీసుకోవాలి

**• వరి పంట వరిపైరు నేలకొరిగితే..**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 30:** పంట నష్ట నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జీలుగు మరియన్న తెలిపారు. వరి పంట గింజ గట్టి పడే దశ, కోత దశలో ఉండటం వల్ల కిందపడిపో వచ్చు. వరిపైరు నేలకొరిగితే ధాన్యం మొలకెత్తకుండా పొలం నుంచి మురు గునీటిని వీలైనంత త్వరగా తీసివే యాలి. నేలకొరిగిన పంటను జడలు కట్టి నిటారుగా నిలబెట్టాలని,దాన్యం మొలకెత్తకుండా 5శాతం సోడియం క్లోరైడ్ (సాధారణ ఉప్పు) ద్రావణాన్ని పిచికారీ చేయాలని,భారీ వర్షాల నేపథ్యంలో పంటలకు ఎరువులు వేయొద్దు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని,కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పగా చేర్చి టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలి.మొక్కజొన్న పంట పూత లేదా గింజ అభివృద్ధి దశలో పంటలు నేలకొరిగే అవకాశముంది. మొక్కలను దగ్గరగా గట్టి ఒకదానికొ కటి ఆసరా ఉండేలా చేయాలి.పంట పొలాల్లో వర్షం నీరు నిలవ కుండా చూసుకోవాలి.కోతకు వచ్చిన మొక్కజొన్న పంటను వర్షం తగ్గే వరకు కోయకుండా వాయిదా వేయాలి.ఆరబెట్టిన గింజలను టార్పాలిన్ కవర్ల కింద కప్పి ఉంచాలి.పత్తి పంటతుపాను హెచ్చరికల నేపథ్యంలో పత్తితీతను వాయిదా వేసుకోవాలి.నల్లరేగడి నేలల్లో తేమ ఎక్కువ రోజులు నిలిచి కుళ్లిపోయే ప్రమాదముంది. వర్షం నీటిని త్వరగా బయటికి పంపించాలి.ఇప్పటికే తీసిన పత్తిని తడవకుండా చూసుకోవాలి.అధిక తేమ వల్ల కాయలు కుళ్లిపోతాయి. దూది రంగుమారి నాణ్యత దెబ్బతింటుంది. దీని నివా రణకు ప్రొపికొనాజోల్ 200మిల్లీలీటర్లను ఎకరా నికి పిచికారీ చేయాలి.వర్షాలు తగ్గిన తర్వాత ఆకులపై మచ్చలు ఏర్ప డితే బోరాక్స్ 1.50గ్రాములను లీటరు నీటికి కలిపి చల్లాలి.తడి వాతావరణం వల్ల పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగు తుంది. వీటి నివారణకు ఎసిఫేట్ 1.50గ్రాము లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.కూరగాయల పంటలో టమాటా, మిరప మొక్కలు గాలికి పడిపో కుండా కర్రలు, తీగలతో ఊతమివ్వాలి. తీగజాతి కూరగాయల పందిళ్లను పటిష్ఠపరచాలి. కొత్తగా వేసిన నారుమళ్లపై వాననీరు పడ కుండా ఏర్పాట్లు చేయాలి. పడిపోయిన మొక్క లను జాగ్రత్తగా నిలబెట్టి వాటి మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలి. నారుకుళ్లు తెగులు నివా రణకు 3గ్రాముల కాఫర్ ఆక్సీక్లోరైడ్ను లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లు తడిసేలా చల్లాలని సూచించారు

# తన్నీరు హరీష్ రావుకి పరామర్శ

**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 30:** ఇటీవల మాజీ మంత్రివర్యులు బిఆర్ఎస్ అగ్ర నాయకులు హరీష్ రావు తండ్రి మృతిచెందిన విషయం తెలిసిందే, ఈ సందర్భంగా హైదరాబాదులో హరీష్ రావు నివాసంలో స్వర్గీయ తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం హరీష్ రావు ను మరియు ఆయన కుటుంబ సభ్యుల్ని పరామర్శించడం జరిగింది. పరామర్శించిన వారిలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజ వరప్రసాద్ మరియు టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేశ్వర్ అందె, రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, శుభప్రద్ పటేల్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, సుమిత్ర ఆనంద్, రంగినేని అభిలాష్ తదితరులు ఉన్నారు.



# కరీంనగర్ సీనియర్ ఖోఖోకు సిద్ధమవుతున్న ఉమ్మడి మహబూబ్నగర్ జట్టు

**• కల్వకుర్తిలో సెలక్షన్ క్యాంప్ ప్రారంభం**





**తొలి అక్షరం/మహబూబ్నగర్, అక్టోబర్ 30:** నవంబర్ 7, 8, 9 తేదీల్లో కరీంనగర్లో జరగబోయే 58వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఖో ఖో గేమ్స్ కోసం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా తరపున క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ వేగంగా సాగుతోంది. కల్వకుర్తి వేదికగా గురువారం ప్రారంభమైన బాల బాలికల సీనియర్ ఖో ఖో సెలక్షన్ క్యాంప్ ఉత్సాహంగా ప్రారంభమైంది.క్యాంప్ ప్రారంభసమావేశానికి హాజరైన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మునగాల సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఖో ఖో ఆట కేవలం శారీరక క్రీడ కాదు, ఇది మానసిక చాతుర్యాన్ని, వేగాన్ని, సమన్వయాన్ని పెంపొందించే సంప్రదాయ క్రీడ అంటూ అభిప్రాయ పడ్డారు. ఈ ఆటలో క్షణాల్లో తీసుకునే నిర్ణయాలు క్రీడాకారుల ప్రతిభను ప్రతిబింబిస్తాయని, ఖో ఖో ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ, జట్టు భావన, పోరాటస్ఫూర్తి నేర్చుకుంటారని తెలిపారు.అదేవిధంగా,క్రీడల ద్వారా మంచి ఉద్యోగాలు, పేరుప్రఖ్యాతలు సాధించవచ్చు.రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఆడబిడ్డలు మెరిసే ప్రదర్శన ఇవ్వాలని ఆశిస్తున్నానని ఆయన చెప్పారు.క్యాంప్లో ఉమ్మడి మహబూబ్నగర్ ఖో ఖో క్రీడా సెక్రటరీ విలియం, పిడి పురంచంద్, పిడి ప్రకాష్, ఆర్గనైజర్ రాజు, జగన్ లు పాల్గొని ఎంపికల పర్యవేక్షణ చేపట్టారు. బాలబాలికలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ సెలక్షన్ మ్యాచ్లలో ప్రతిభ కనబరుస్తున్నారు.రాష్ట్ర స్థాయి సీనియర్ ఖో ఖో పోటీలకు ఈసారి ఉమ్మడి మహబూబ్నగర్ జట్టు సత్తా చాటుతుందని, కల్వకుర్తి వేదికగా సెలక్షన్స్ జరగడం సంతోషంగా ఉందని మునగాల సతీష్ కుమార్ పేర్కొన్నారు. క్రీడాకారులు ధైర్యంతో ఆడి జిల్లాకు ప్రతిష్ఠ తెచ్చిపెట్టాలని ఆయన ఆకాంక్షించారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం: జిల్లా ఎస్పీ డా. శబరీష్

**• పోలీస్ అమరవీరుల త్యాగాలకు నివాళిగా మెగా రక్తదాన శిబిరం**





**తొలి అక్షరం/ములుగు అక్టోబర్ 30 :**పోలీస్ అమరవీరుల సంస్మరణ సందర్భంగా, ములుగు జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి., ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం ములుగు డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో ములుగు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమాలు జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి., ఐపీఎస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ %-%“రక్తదానం అనేది ప్రాణదానం తో సమానం. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను రక్షించడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుంది. పోలీస్ అమరవీరుల స్మరణోత్సవాల సందర్భంగా యువత, ప్రజలు, ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది ఇలా సుమారు 500 మంది స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమని” అన్నారు.అలాగే, విధి నిర్వర్తనలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరవదని, వారి స్మృతికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోలీసులు కేవలం శాంతి భద్రతల పరిరక్షకులే కాకుండా, సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారని తెలిపారు. రక్తదానంపై ఉన్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం వలన ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు లేదా తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్నవారికి ప్రాణ రక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 180 యూనిట్ల రక్తం సేకరించబడింది.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శివం ఉపాధ్యాయ, ఐపీఎస్, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు దయాకర్, సురేష్, ఆర్ఐలు స్వామి, సంతోష్, వెంకటనారాయణ, ఎస్ఐలు, ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అనుష, ఆసుపత్రి సిబ్బంది, వరంగల్ మరియు ములుగు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్గా బర్క కృష్ణ



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 30:** తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య ఈరోజు జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్క కృష్ణ ను తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్ గా నియమించడం జరిగినది.ఈ కార్యక్రమానికి బీసీ నాయకులు జేఏసీ నాయకులు, బీసీ నాయకులు, జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్క కృష్ణకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ అధ్యక్షులుగా నియమితులైన బర్క కృష్ణ మాట్లాడుతూ తనపై పూర్తి నమ్మకంతో రాష్ట్ర జేఏసీ అధ్యక్షులుగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యకు ధన్యవాదాలు తెలియజేస్తూ 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధించేంతవరకు అవిశ్రాంతంగా పోరాటం చేస్తామని, అన్ని కులాలను అన్ని వర్గాలను అన్ని పార్టీలను కలుపుకొని పోయి బీసీల అభ్యున్నతికై పాటుపడతానని, బీసీలకు అందాల్సిన అన్ని సంక్షేమ ఫలాలు అందేంతవరకు ముందు తానే నడుస్తానని, బీసీల సంరక్షణ ధ్యేయంగా పూర్తి నమ్మకం మరియు విశ్వాసంతో పని చేస్తానని, బీసీలకు రాజ్యాధికారం దిశగా అన్ని వర్గాలను కలుపుకొని పోతానని బీసీల సంపూర్ణ అభివృద్ధి తన ధ్యేయమని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప మహిళలు పెద్దలు బీసీ సేన షాద్ నగర్ నియోజకవర్గం బీసీ నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెరిగిన ధరలకు తగ్గట్లు భత్యాలు సవరించాలని ఎంఈఓకు వినతి పత్రం

**- వేతనాలు పెంచి, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని సిఐటియు డిమాండ్**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 30:** మధ్యాహ్న భోజన కార్యక్రమంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ..సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు గురువారం మండల విద్యాధికారి (ఎంఈఓ) మనోహర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో కార్మికుల జీవన స్థితిగతులు, వేతన సమస్యలు, పెండింగ్ బకాయిలు వంటి అంశాలు విస్తృతంగా చర్చించారు.డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ మాట్లాడుతూ...రోజురోజుకీ పెరిగిపోతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని గుడ్ల ధర, కట్టెల బిల్లులు, గ్యాస్ చార్జీలు తగిన విధంగా పెంచాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. అలాగే గత విద్యా సంవత్సరానికి, ప్రస్తుతానికి సంబంధించిన పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, ఈ వేతనాలు కార్మికుల కుటుంబ జీవనాధారానికి మద్దతుగా నిలుస్తాయని తెలిపారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.18,000గా నిర్ధారించాలని, పిఎఫ్, ఈఎస్ఐ వంటి అవకాశాలు సమగ్రంగా అమలు చేయాలని సంఘం డిమాండ్ చేసింది. సేవ చేస్తున్న వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని వారు పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు సమగ్రంగా కార్మికుల సమస్యలను వివరించి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.కార్మికుల గళం అధికారవర్గాల దృష్టికి చేరి, త్వరలో సానుకూల నిర్ణయం వెలువడాలని సిఐటియు నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాళు చిట్టెమ్మ, సుమలత, కాజా బేగం, యాదమ్మ, రెహానా, లలితమ్మ, హసీనా, సౌలీబి, శివమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

# వర్షం ప్రభావం తగ్గించడంలో అభివృద్ధి పనులు కీలకం

**- కార్పొరేటర్ డా. దాస్యం అభినవ్ భాస్కర్**



**తొలి అక్షరం/హన్మకొండ, అక్టోబర్ 30:**హన్మకొండలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో 60వ డివిజన్లోని పలు కాలనీలు పరిశీలించి,స్థానికులను పలు విషయాలు అడిగి తెలుసుకున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 60వ డివిజన్ కార్పొరేటర్ డా. దాస్యం అభినవ్ భాస్కర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లో వర్షాకాలంలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే ప్రణాళికలు రూపొందించి, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల ఈసారి వర్షా ప్రభావం తగ్గిందని, ఈ సారి పెద్దగా ఇబ్బందులు లేకుండా పరిస్థితిని నియంత్రించగలిగాం అని తెలిపారు. అభివృద్ధి పనుల వల్ల చాలా సమస్యలు తగ్గినప్పటికీ, ఇంకా కొని చోట్ల పనులు చేయాల్సి ఉందని, ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం లభిస్తే, మిగిలిన సమస్యలను కూడా త్వరగా పరిష్కరించగలమని అభినవ్ భాస్కర్ తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారు. ఎక్కడైనా సమస్యలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు స్థానిక బిజెపి నాయకులు, స్థానికులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# మొదలైన ట్రైబల్ వర్సిటీ ప్రహరీ పనులు



**తొలి అక్షరం/ములుగు అక్టోబర్ 30 :** సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ ప్రహరీ గోడ పనులు మొదలయ్యాయి. రూ.25కోట్ల వ్యయంతో 8 కిలోమీటర్ల మేర చేపట్టిన పనులను ఇటీవల మంత్రి సీతక్క, ఎంపీలు బలరాం నాయక్, నగేష్ ప్రారంభించిన విషయం తేలిసిందే. ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ఫిల్లర్లు, సిమెంట్ ఇటుకలతో గోడను నిర్మించనున్నారు. అవసరమైన సెంట్రింగ్ పనులు జరుగుతున్నాయి. తాత్కాలిక కాంక్రీట్ ప్లాంట్ను సిద్ధం చేశారు.



# ఆపదలో అన్నగా అండగా ఉంటా!

**- ముంపు ప్రాంత ప్రజలకు కార్పోరేటర్ రాజు భరోసా!**

**- కలెక్టర్‌తో కలిసి .. ముంపు ప్రాంతా ల్లో పర్యటన..**





**తొలి అక్షరం/హన్మకొండ, అక్టోబర్ 30:**హన్మకొండ లోని 31 వ డివిజన్ న్యూ శాయంపేట లో మొంథా తుఫాన్ ప్రభావంతో ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానని ముంపు ప్రాంతాల ప్రజలకు భరోసా ఇచ్చారు 31 డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు.31 డివిజన్లోని ముంపు ప్రాంతాల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశం మేరకు హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరిష్ సహకారంతో.. వరదల్లో చిక్కుకున్న కాలనీలకు ఆహార పొట్లాలను కార్పొరేటర్ రాజు పంపిణీ చేశారు. ఎంతటి ఆపద వచ్చినా .. ఓ అన్నగా మీకు అండగా ఉంటానని.. డివిజన్ ప్రజలు ఎలాంటి అధైర్య పడవద్దని కాలనీలలో వరద సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతు న్నాయని, వర్షం తగ్గిన కూడా వరద ఉధృతి అలాగే ఉందని మీకు ఏ సహకారం కావాలన్నా తనకు నేరుగా ఫోన్ చేయాలని కార్పొరేటర్ కోరారు. అధికార యంత్రాంగం డిప్యూటీ కమిషన్ రవీందర్,కాజీపేట తహ సిల్దార్ ఇస్లావత్ భావు సింగ్,సుబేదారి సర్కిల్ ఇన్స్పెక్టర్ రంజిత్ రావు,మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్,DRF రెస్క్యూ టీం మరియు మున్సిపాలిటీ వర్కర్స్ ఎప్పటికప్పుడు .. ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సహా యక చర్యల్లో పాల్గొంటున్నారని.. వరద ఉధృతి తగ్గేవరకు.. కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని,చిన్న పిల్లలను బయటకి రాకుండా చూసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు


## నూతన వధువరులను ఆశీర్వధించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 30:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని వైబిఆర్ ఫంక్షన్ హాల్లో గురువారం రోజున జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులైన హరీష్ కుమార్ - సంధ్యలను ఆశీర్వదించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్.ఈకార్యక్రమంలో కేహెచ్చ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి,మాజీ వైఎస్ ఎంపిపి కాలే మల్లేష్, మాజీ ఎంపిటిసి బూడిద రాములు గౌడ్, మాజీ సర్పంచ్లు లగ్గాని రమేష్ గౌడ్,బీసు చందర్ గౌడ్,కోడిమాల యాదగిరి గౌడ్, తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చెట్లను నరికి వేసిన వారిపై జరిమాన విధించిన అటవీ శాఖ

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 30:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్పూర్ గ్రామ శివారులోని శ్రీ త్రిలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో చెట్లను నరికివేసిన దేవాలయ కమిటీ సభ్యులపై ఇటీవల చర్యలు తీసుకోవాలని తాజ్పూర్ గ్రామస్తులు జిల్లా అటవీ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. గురువారం రోజున ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్ నాయక్ జరిమానా రూ.12,160 రూపాయలు దేవాలయ కమిటీపై విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అటవీశాఖకు తెలపకుండా ఎవరైనా చెట్లను నరికి వేసినచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు.



# పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 30:** పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాపితంగా కురుస్తున్న మొంథా తుపాను ప్రభావంతో అటు మున్నేరు వాగు, రాళ్ల వాగు తో పాటు శివారు చెరువులు నిండి భారీ వరదలు పట్టణాన్ని ముంచేత్తాయి మున్నేరు వాగు సమీపంలోని రైతులు వేసిన వరి పంటలు భారీ వరద నీళ్లలో మునిగి రైతులకు తీవ్రమైన నష్టం కలిగించింది. సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గుమ్మడూరు ప్రాంత రైతులను పంటలను సందర్శించరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజులనుండి రాష్ట్ర వ్యాపితంగా ఏడ తెరపిలేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మహబూబాబాద్ లోని గుమ్మడూరు శివారులోని మున్నేరు వాగు ఈదుల పూసపల్లి చెరువు. రభద్ర చెరువు గుండ్లకుంట చెరువు. బంధం చెరువు. జనాల చెరువు పాకాల చెరువు లనుండి భారీ వరదలతో రైతులకు పంటలు కొట్టుకోపోయాయని తెలిపారు.రైతులు కష్టపడి అప్పులు తీసుకొచ్చి వారి పంటలు వేస్తే మొంథా తుపాను భారీ వరదలతో చేతికొచ్చిన వారి పొలాలు నీళ్ల పాలు అయ్యాయని దంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయాన్ని ఆవేదన వ్యక్తం చేసారు.ఏటిగడ్డ తండాలో గిరిజన రైతులు ముక్యంగా వారి పంటల మీదే ఆధార పడి జీవిస్తున్నారు అలాగే మున్నేరు వాగు రాళ్ల వాగు రెండు భారీ వరదలతో పోతేట్టడంతో నీళ్లు తండాను చుట్టి ముట్టడంతో తండావాసులు భయాందోళన లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రతి ఎకరానికి రూ.. 70వేల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేసారు. సిపిఎం పట్టణ బృందం మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ గారితో ఫోన్ లో మాట్లాడి వివరించడం జరిగిందని, అలాగే వ్యవసాయ మండల అధికారి తిరుపతి రెడ్డి తో సిపిఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ సుమారు ఐదు వందల ఎకరాల వారి పంట నీట మునిగిందని తెలిపారు. రైతుల పంట నష్టాన్ని ప్రభుత్వం ద్వారా ఎకరానికి రూ..70వేయిల రూపాయలు అందించాలని కోరారు. పంట నష్టాన్ని ప్రభుత్వంనికి అందిస్తానని అందరికి నష్ట పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటా మని వ్యవసాయ అధికారి తిరుపతి రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. పంటలను పరిశీలించిన వారిలోసిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చిపిరి యాకయ్య,కుమ్మరి కుంట్ల నాగన్న,శాఖ కార్యదర్శి బానోత్ ప్రకాష్ నాయక్ రైతులు బానోత్ సుమన్ భూక్యా ఖీమా గుగులోత్ దశ్రు నాయక్ భూక్యా దయాకర్ వంకుడోత్ హచ్చమ్మ బానోత్ రమేష్ గుగులోత్ గన్య మోహన్ ఉన్నారు.

# ఎంత సేవ చేసినా కన్న ఊరి ఋణం తీర్చుకోలేను







**ఎన్ఆర్ఐ దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి**

**మునిపంపులలో ముగిసిన ఉచిత కంటి పొర చికిత్స శిభిరం**

**సద్వినియోగం చేసుకున్న మండల ప్రాంత ప్రజలు**

**122మందికి ఉచిత కంటి ఆపరేషన్లు**

**2119 మందికి ఉచిత కంటి అద్దాల పంపిణి**



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 30:**ఎంత సేవ చేసిన జన్మనిచ్చిన ఋణం తీర్చుకోలేమని మునిపంపుల ఉచిత కంటి పొర చికిత్స శిభిరం నిర్వాహకులు దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి (ఎన్ఆర్ఐ) అన్నారు. మునిపంపుల గ్రామంలో మాజీ సర్పంచ్ దేవిరెడ్డి రాంరెడ్డి జ్ఞాపకార్థం భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో శంకర నేత్రలయ చెన్నై డాక్టర్లతో 22వ తేదీ నుండి ప్రారంభమైన ఉచిత కంటిపొర చికిత్స శిభిరం గురువారం రోజు ముగిసింది.శిభిరం ముగింపు సందర్భంగా ఆపరేషన్ చేసుకున్న వారితో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో శిభిరం నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ఉచిత కంటి పొర చికిత్స శిభిరంలో మొత్తం 2560 మంది ఒపీ నమోదు చేసుకోగా 2119 మందికి ఉచిత కంటి అద్దాల పంపిణి జరిగిందని 122మందికి కంటి ఆపరేషన్ జరిగిందని 211మందిని చెన్నై లో శంకర నెత్రాలాయకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కన్న ఊరు ఋణం తీర్చుకోవడం కోసమే ఈ మహోత్తర కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఊరి కోసం ఇంకా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు.చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న ప్రజలకు, నిరాటాంకంగా పని చేసిన వాలంటీర్లు,వివిధ యువజన సంఘాలు, అఖిల పక్ష పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు.**పది రోజుల పాటు సేవలందించిన వాలంటీర్లు** దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటిపొరా చికిత్స శిభిరంలో గ్రామంలోని యువత భగత్ సింగ్ విజ్ఞానకేంద్రం మరియు భీమ్ ఫాలోవర్స్ వారు 50 మంది స్వచ్ఛందంగా పది రోజులపాటు గ్రామ గ్రామన తిరిగి ప్రచారం నిర్వహించి 20 గ్రామాల నుండి వచ్చిన వారికి పరీక్షలు చేయించి ఉచిత కంటి అద్దాలు పంపిని చేసి భోజనాలు, వసతులు ఏర్పాటు చేశారు.కో -ఆర్డినేటర్ తొలుపునూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమలో మాజీ సర్పంచ్ దేవిరెడ్డి సావిత్రమ్మ, దేవిరెడ్డి పద్మ, సమన్వయ కర్తలు బొడ్డుపల్లి వెంకటేశం, గాదె శోభారాణి,శంకర నేత్రలయ కోఆర్డినేటర్ భాను ప్రకాష్,అఖిల పక్ష నాయకులు మన్నెం పద్మారెడ్డి, తాళ్లపల్లి జితేందర్, కట్ట యాదయ్య,గంటెపాక శివ కుమార్,ఉయ్యాల నర్సింహా,ఉడుతల శ్రీనివాస్,తొలుపునూరి శ్రీనివాస్, గాదె కృష్ణ,బూడిద బిక్షం,చింత గిరి బాబు, తుర్కపల్లి నరేష్, యాదాసు అరుణ్,అజయ్,బత్తిని సందీప్ పాల్గొన్నారు.

# రాజుల కొత్తపల్లి చెరువు కట్టపై అసెంబ్లీలో గళమెత్తినా స్థానిక ఎమ్మెల్యే






**ప్రస్తుతం రెండు కి.మీ. రోడ్డు ఛిద్రం, రవాణా వ్యవస్థ స్తంభన!**

**చెరువు కట్ట తెగిపోవడంతో గ్రామాన్ని స్వయంగా సందర్శించిన ఎమ్మెల్యే డా. మురళి నాయక్**

**“అధ్యక్షా! ప్రజల ఆవేదన అర్థం చేసుకోండి” అంటూ అసెంబ్లీలో గర్జించిన ఎమ్మెల్యే**

**ఎమ్మెల్యే హామీ ఇచ్చి ఏడాది గడిచినా పునరుద్ధరణ పనులు ప్రారంభం కాని దుస్థితి**

**భారీ వర్షాలకు పంట నష్టం - ఛిద్రమైన రోడ్డుతో నిలిచిపోయిన రాకపోకలు**

**“మాటలే కాదు, మాకు పన కావాలి” అంటూ గ్రామ ప్రజల ఆవేదన**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 30:** మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురు మండలం, రాజుల కొత్తపల్లి గ్రామం నేడు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, ప్రజల నిస్సత్తువకు అద్దం పడుతోంది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాల కారణంగా తెగిపోయిన చెరువు కట్ట నాటి నష్టాన్ని ఇప్పటికీ కొనసాగిస్తోంది. ఆ సమయంలో రైతులు, ప్రజల బాధను గమనించిన స్థానిక ఎమ్మెల్యే డా. మురళి నాయక్ స్వయంగా గ్రామానికి వచ్చి క్షేత్ర స్థాయిలో పరిస్థితులు పరిశీలించారు.గ్రామ ప్రజల ఆవేదన విని, ఇది ప్రజల జీవనాధారం అని గుర్తించి, వెంటనే కట్టను పునరుద్ధరించాలని అక్కడే అధికారులకు సూచించారు. అనంతరం, అసెంబ్లీ వేదికగా జీరో అవర్‌లో ఈ అత్యవసర అంశాన్ని లేవనెత్తి గళమెత్తారు.**అసెంబ్లీలో ప్రతిధ్వనించిన ‘అధ్యక్షా!’ నినాదం** “అధ్యక్షా! రాజుల కొత్తపల్లి గ్రామంలో చెరువు కట్ట తెగిపోయింది. రైతులు పంటలన్నీ కోల్పోయారు. ప్రజల ఆవేదన అర్థం చేసుకోండి. వెంటనే ప్రభుత్వం స్పందించి కట్టను పునరుద్ధరించాలి. మళ్లీ వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది,” అంటూ ఆయన సభలో ప్రభుత్వం దృష్టిని బలంగా ఆకర్షించారు.ఆ మాటలు ప్రజల్లో కొత్త ఆశలు చిగురింపజేశాయి. “మా సమస్య అసెంబ్లీ వరకు వెళ్లింది. తప్పకుండా కట్ట వేస్తారు” అని అందరూ ఆనందపడ్డారు. కానీ ఆ ఆశలు నిలవలేదు. ఒక సంవత్సరం గడిచిపోయింది, కానీ కట్ట పునరుద్ధరణ పనులు మాత్రం నేటికీ మొదలు కాలేదు, ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.**పంట నష్టం, రోడ్డు ఛిద్రం - రవాణా స్తంభన** ఇప్పుడేమో మరోసారి వర్షాలు కురుస్తున్నాయి. చెరువులోకి పెద్ద ఎత్తున నీరు చేరి పొంగిపొరలుతోంది. ఫలితంగా, పొలాలన్నీ నీట మునిగిపోయాయి, రైతులు మళ్లీ తీవ్రమైన పంట నష్టాన్ని చవిచూస్తున్నారు. ఇంతటితో ఆగకుండా, తెగిపోయిన కట్ట కారణంగా సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది, రాకపోకలు నిలిచిపోయాయి.దీని ప్రభావం ముఖ్యంగా ఆర్టీసీ బస్సు సర్వీసుపై పడింది. చెట్ల ముప్పారం మీదికెల్లి రాజుల కొత్తపల్లి-నెల్లికుదురుకు వెళ్లి, తిరిగి తార్ సింగ్ బావి, చిన్న ముప్పారం మీదుగా మహబూబాబాద్‌కు వెళ్లే ఒక్కేఒక్క ఆర్టీసీ బస్సుపైనే ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఆధారపడి ఉన్నారు. తాజా వర్షాలకు చెట్ల ముప్పారంలో రోడ్డు మొత్తం చిన్నపాటి కుంటలా మారడంతో, బస్సు డ్రైవర్ “బస్సు పాడవుతు ంది” అని చెబుతూ, చిన్న ముప్పారం నుంచే బస్సును వెనక్కి తీసుకుని వెళ్తున్నారు. దీంతో ప్రతిరోజు స్కూల్, కాలేజీలకు వెళ్లే విద్యార్థుల ప్రయాణాలు ఆగిపోయాయి, వారి భవితవ్యం ప్రశ్నార్థక మైంది.గ్రామ ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, “మా తరపున గళమెత్తిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు, కానీ మాకు మాటలు కాదు,పని కావాలని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

# రాజాగోపాల్ రెడ్డికి బీర్ల ఐలయ్యలకు కూడా మంత్రిపదవి!!!





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు30:** యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలకు కూడా మంత్రిపదవి వరించనుంది. తెలంగాణ,క్యాబినెట్లో ఇంకా మూడు మంత్రి పదవులు కాళీ ఒకటి మైనారిటీ కోటాలో అజారు ద్దీన్ కి ,సుదర్శన్ రెడ్డికి కాకుండా రాజగోపాల్ రెడ్డికి మంత్రిపదవి యోచనలో కాంగ్రెస్ మరొకటి బీసీ కోటాలో మరొకరికి చాన్స్ యాదవ కురుమ వర్గ కోటలో బీర్ల ఐలయ్యకు గతంలో ముదిరాజ్ కోట నుంచి శ్రీహరికి మంత్రి పదవి ఇప్పుడు యాదవ, కురుమ,మున్నూరు కాపుల నుండి ఒకరికి మంత్రి చాన్స్ ఇవ్వాలని అధిష్టానం ఆలోచన వీరిలో ముందంజలో బీర్ల ఐలయ్య ఉన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందచేత



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 30:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గురువారం రోజు గుట్ట మున్సిపల్ కమీషనర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.యాదగిరిగుట్ట పట్టణ శివారులో వైన్సులు ఏర్పాటు చేయాలిని యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్ కమిషనర్ కి అందచేసిన వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేసారు.యాదగిరిగుట్ట పట్టణంలో ఉన్నటువంటి వైన్సులను యాదగిరిగుట్ట పట్టణ శివారులో ఏర్పాటు చేయాలని కోరారు.యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పుణ్యక్షేత్రంలో స్థానికులకు మరియు భక్తులకు పాతగుట్ట రోడ్డులో వెళ్లడానికి ఇబ్బందిగా మారింది.పాతగుట్ట రోడ్డులో ప్రతినిత్యం ట్రాఫిక్ జాం కావడం జరుగుతుంది.విద్యార్థులు వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు.అంతే కాకుండా ఈ రహదారిలో పార్కింగ్ సౌకర్యం లేకుండా పర్మిషన్ తీసుకోకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు.కావున యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసే వైన్సులను పట్టణ శివారులో ఏర్పాటు చేయాలని కోరుతున్నాము. పట్టణంలో ఉన్న వైన్సులను తక్షణమే తొలగించి పార్కింగ్ తో కూడిన వైన్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంపల్లి రజనీకాంత్ గౌడ్,హీరాకర్ లకన్ జీ,తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ కారణంగా గ్రామీణ వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

- గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షులు అంకం శ్రీనివాస్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబరు 30:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షులు అంకం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి సుల్తాన్ శ్రీనివాస్,మాట్లాడుతూ తుఫాన్ వర్షం కారణంగామండలంలోని వివిధ గ్రామాల్లో ప్రథమ చికిత్స వైద్యం అందిస్తున్న గ్రామీణ వైద్యులు తుఫాన్ వర్షం కారణంగా అప్రమత్తంగా ఉండాలని కోరారు. విధి నిర్వాహణలో గ్రామాల్లో వైద్య సేవలు అందించే ప్రక్రియలో వర్షం కారణంగా బైకులపై పొయ్యేప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి కాబట్టి జాగ్రత్తగా ఉండాలని కోరారు. వర్షంలో తడుస్తూ మీకు ఏదైనా జరగనిది జరిగితే మీకుటుంబాలు రోదనపడే ప్రమాదం ఉంది.కాబట్టి దయచేసి జాగ్రత్తగా వుండాలని విజ్ఞప్తి చేశారు.గ్రామీణ వైద్యుల సేవలను గురించి ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డు పత్రాలను అందించాలని ప్రభుత్వానికి కోరారు.

## మహిళలకు సమాన హక్కులపై అవగాహన కార్యక్రమం



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 30:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని మహిళ సమైక్య భవనంలో గురువారం రోజున జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల మహిళ సంఘ బంధం అధ్యక్షురాలు రచ్చ పల్లవి జ్ఞానేశ్వర్ సమక్షంలో లీగల్ సేల్ సభ్యులు కానుగంటి శ్రీశైలం, అల్లోజు విజయలక్ష్మి లీగల్ ఎయిడ్ ని ఏర్పాటు చేయడం జరిగింది.40 మహిళా సంఘాల అధ్యక్షురాళ్లకు బాల్య వివాహాలపై మరియు పోక్సో చట్టం మరియు మహిళల రక్షణ విద్య వైద్యం సమాన హక్కులు లింగ వివక్ష తదితర అంశాలపై అవగాహన కల్పించారు.చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల మహిళ సంఘ బంధం అధ్యక్షురాలు రచ్చ పల్లవి జ్ఞానేశ్వర్,గుండు మాధవి,కవిత,సరిత,నరసింహ, సిఆర్పిలు,సీసీలు మరియు మహిళా అధ్యక్షురాల్లు,వీబీకేలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుడు కడెం నర్సింహులుకు శ్రద్ధాంజలి ఘటించిన బీఆర్ఎస్ నాయకులు- కర్రె నాగరాజు

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 30:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో కడెం నర్సింహులు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ పార్థివదేహానికి పూలమాలవేసి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది.పితృ శోకంలో ఉన్న కడెం శ్రీధర్ ను ఓదార్చి అండగా ఉంటాం అని బీఆర్ఎస్ నాయకులు కర్రే నాగరాజు అన్నారు.వారి వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గౌడ శ్రీశైలం ,మాజీ ఉపసర్పంచ్ కారింగుల కిష్టయ్య, సీనియర్ నాయకులు కర్రె చంద్రశేఖర్, కర్రే అనిల్ ,బావండ్ల మధు, భూషల కృష్ణ, చిన్నోల స్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## చెట్ల ముప్పారం - రాజుల కొత్తపల్లి రహదారి మినికుంటలా మారింది

- వర్షం తాకిడికి రహదారి కుంటలా - ప్రజలకు మహా ఇబ్బంది
- చెట్ల ముప్పారం నుంచి కొత్తపల్లివైపు దారి మొత్తం బురదమయం
- బస్సులు మధ్యలోనే తిరుగు ప్రయాణం - విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు
- కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యం - ప్రజల్లో ఆగ్రహావేశం
- వెంటనే చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తుల విజ్ఞప్తి




**తొలి అక్షరం/ఇనుగుర్తి అక్టోబర్ 30:** ఇనుగుర్తి మండల కేంద్రంలోనిచెట్ల ముప్పారం నుంచి రాజుల కొత్తపల్లి వైపు వెళ్లే రహదారి ౹ఇప్పుడు రహదారి కాదు, మినీ కుంటల బురదమయమైన దారి! ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో ఈ రహదారి మొత్తం నీటితో నిండిపోయి వాహనదారులకు తలనొప్పిగా మారింది.రహదారి గుంతలతో నిండిపోయి వాహనాలు ఒక్క అడుగు కూడా ముందుకు కదలలేని పరిస్థితి. దీంతో ఆర్టీసీ బస్సులు చిన్న ముప్పారం దగ్గరే తిరిగిపోతున్నాయి. "ముందుకు వెళ్తే బస్సు మునిగిపోతుందేమో అనిపిస్తుంది !" అంటూ డ్రైవర్లు చెబుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ప్రతిరోజూ ఈ బురద దారిలో నడుచుకుంటూ కొత్తపల్లికి వెళ్లాల్సి వస్తోంది.గ్రామ ప్రజలు మండిపడుతూ ౹ "ప్రతీ సారి వర్షం కురిసినా ఇదే దుస్థితి! కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల మాకు ఈ కష్టాలు!" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## కపిల్ బాల కుటీర్ సిసిఐ హోమ్‌లో స్వచ్ఛభారత్...

**తొలి అక్షరం/కరీంనగర్,అక్టోబర్30:** కరీంనగర్ పట్టణం లోని కపిల్ బాల కుటీర్ సీసీఐ హోమ్ లో గురువారం రోజున స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. అంతకుముందు సీసీఐ హోమ్ ను సిడబ్ల్యుసి మెంబర్ కళింగ శేఖర్ , డిసిపిఓ పర్వీన్, డి సి పి యు పూదరి శాంతలు సందర్శించి, మేనేజ్మెంట్ కమిటీ మీటింగ్ లో పాల్గొని సీసీఏ హోమ్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆశ్రమంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడుతూ హోమ్ లో ఉంటున్న విద్యార్థిని విద్యార్థులు మన చుట్టూ ఉన్న ప్రాంతాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని , అనారోగ్యం దరిచేరదన్నారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న పిల్లలందరూ లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థితికి రావాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో కపిల్ బాలకుటీర్ ఉపాధ్యక్షులు రాజారెడ్డి, ఇంచార్జ్ వకుళాదేవి, కృష్ణవేణి, శ్రీనివాస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్ఎఫ్‌సిఎల్‌ను కాపాడుకుందాం !

- అదే దిశలో కార్మిక హక్కులను రక్షించుకుందాం!!
- ఆర్ఎఫ్‌సిఎల్ యాజమాన్యం కార్మిక సంఘాలతో కార్మిక సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించాలి.
- TUCI పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు తోకల రమేష్.



**తొలి అక్షరం/కరీంనగర్,అక్టోబర్30:** ఎన్నో సుదీర్ఘ పోరాటాలు ఎన్నో ఆటుపోటులు ఎంతగానో నిరీక్షణ అనంతరం ఎఫ్సీఐ స్థానంలో ఏర్పడ్డ ఆర్ఎఫ్‌సిఎల్‌లో జరుగుతున్న పరిణామాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతంలో కుటుంబం లాగా వ్యవహరించిన ఎఫ్సీఐ నేడు ఆ వాతావరణమే లేకపోవడము మరింతగా ఆందోళనకు గురి చేస్తున్నది.ఆర్ఎఫ్‌సిఎల్ యాజ మాన్యము పారిశ్రామిక శాంతికి విఘాతం కలిగించే విధంగా కార్మిక సంఘాలను ప్రవేశించకుండా ఒక నియంతృత్వ ధోరణితో వ్యవహరించడం కూడా ఈ పరిస్థితికి కారణం అవుతున్నది. ఒకప్పుడు 4వేల మందితో నడిచిన పరిశ్రమ నేడు 850 మంది కాంట్రాక్టు కార్మికులు 500 మంది పర్మనెంట్ కార్మికులతో నడుస్తున్న వాతావరణ మధ్య కార్మికులకు యాజమాన్యానికి మధ్య సహృద్భావ వాతావరణం లేకపోవడం అనేది ఇక్కడ పారిశ్రామిక శాంతికి మరింతగా విఘాతం కలిగిస్తున్నది. ఇప్పటికే చీటికిమాటికి పరిశ్రమ రిపేర్ కావడం ఏడాదిలో మూడు నెలలకు పైగా బందు కావడం నష్టాలకు గురి కావడం జరుగుతూ వస్తున్నది. కార్మిక సమస్యలపై కార్మిక హక్కులపై న్యాయబద్ధంగా రావాల్సిన వాటిని చెల్లించాల్సిన యాజమాన్యం మాకు ఏమీ సంబంధం లేదంటూ కాంట్రాక్టర్లపై తోసి తప్పించుకునే విధంగా వ్యవహరించడం కూడా కార్మికుల అసంతృప్తికి తోడు అవుతున్నది. ఒకటికి పదిసార్లు యాజమాన్యంతో చర్చించి కార్మిక సమస్యలపై ఉద్యమించాల్సిన సంఘాలు చీటికిమాటికి సమ్మె వాతావరణం సృష్టిస్తూ ఉండడం కూడా సరి అయిన వాతావరణం కాదు. అన్ని సంఘాలతో చర్చించి కార్మిక శాఖ అధికారులతో చర్చించి చివరకు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సమ్మె అనే ఆయుధాన్ని యాజమాన్యంపై ఉపయోగించాలి కానీ, ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదు. కార్మిక హక్కులపై ప్రిన్సిపల్ బాధ్యత ముమ్మాటికి యాజమాన్యానిదే. ఆ బాధ్యత నుంచి ఎప్పటికీ తప్పించుకోలేదు. చట్టబద్ధంగా రావలసిన హక్కులను కార్మికులకు అమలు చేయాలని యాజమాన్యా న్ని డిమాండ్ చేస్తున్నాం. కార్మిక సంఘాలతో ఇప్పటికైనా నెలకు ఒకసారి కార్మిక సమస్యలపై చర్చించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన ఆర్ ఎఫ్ సి ఎల్ సంస్థను కాపాడుకుందాం అని కార్మిక సమస్యలపై అన్ని సంఘాల నాయకత్వంలో ఐక్యంగా పోరాడుదాం అని పిలుపునిస్తున్నాం చర్చలకు అన్ని సంఘాలతో ముందుకు రావాలని కోరుతున్నాం.

## గంగాధర ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో "వాక్ ఫర్ యూనిటీ" కార్యక్రమం

**తొలి అక్షరం/కరీంనగర్,అక్టోబర్30:** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఈ రోజున సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా జాతి ఐక్యత దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా ఈరోజు స్థానిక ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో మధుర నగర్ లో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల మరియు కళాశాల విద్యార్థినిలు, కళాశాల సిబ్బంది,స్థానిక రాజకీయ నాయకులు మరియు ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి గంగాధర మండల కేంద్రంలో 2KM "వాక్ ఫర్ యూనిటీ" కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్ఐ గారు మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ యొక్క ఉద్దేశాలను, ఆశయాలను పాఠశాల విద్యార్థులకు వివరించడం జరిగింది. పాఠశాలలో ఇటీవల జరిగిన సంఘటన నేపథ్యంలో పాఠశాలలో విద్యార్థినిలు తమకు ఏ సమస్య ఉన్న వెంటనే పాఠశాల ఉపాధ్యాయులతో, తల్లిదండ్రులతో లేదా నేరుగా పోలీసులకు వెంటనే చెప్పాలని, ఇంకా ఇతర ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని వెంటనే మేము పరిష్కరిస్తామని ఇస్తామని ఎస్ఐ వంశీకృష్ణ తెలపడం జరిగింది.

## ప్రమాదవశాత్తు కరెంటు షాక్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 30:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ఓర్సు సురేష్ విద్యుత్ హెల్పర్ గా పని చేస్తున్నాడు.ఓ రైతు పొలంలో ట్రాన్స్ ఫార్మర్ కూలిపోవడంతో విద్యుత్ లైన్ సరిచేస్తుండగా ప్రమాదవ షాత్తు కరెంట్ షాక్ కొట్టింది.అంబులెన్స్ లో భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందచేసిన బీర్ల ఫౌండేషన్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబరు 30:** ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎం బాబు కుటుంబానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు బీర్ల ఫౌండేషన్ చైర్పరసన్ బీర్ల అనిత సహాయంతో 50 కిలోల బియ్యంను కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ ముక్కర్ల మల్లేష్ యాదవ్, యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు బందారపు బిక్షపతి గౌడ్, యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్,హీరే కార్ లకన్ భాయ్ల ఆధ్వర్యంలో అందచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌సిఐ సౌత్ జోన్ అడిషనల్ జోనల్ సెక్రటరీగా లోడి రామకృష్ణ గౌడ్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 30:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మ కూరు(ఎం)మండల కేంద్రానికి చెందిన మాజీ సైనికుడు లోడి రామకృష్ణ గౌడ్ అక్టోబరు 26న బెంగళూరులో జరిగిన ఆల్ ఇండియా ఎఫ్ సి ఐ ఎంప్లాయిస్ యూనియన్ బి కె ఎన్ కె సంగ్ సౌత్ జోన్ కాన్ఫరెన్స్ సమావేశంలో లోడి రామకృష్ణ గౌడ్ ను సౌత్ జోన్ అడిషనల్ జోనల్ సెక్రెటరీగా ఐదు సంవత్సరాల కాల పరిమితికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## నూతన వధువరులను ఆశీర్వధించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబరు 30:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రాజాపేట మండలం జాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కోటగిరీ లక్ష్మీపతి మనుమరాలు చల్లూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీతోజు వేంకట చారి కుమర్తే వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వీరివెంటా మండల కాంగ్రెసు పార్టీ నాయకులు ఉన్నారు.

# అమితాబ్ మనవడి ‘ఇక్కీస్’.. ఆకట్టుకుంటున్న ట్రైలర్




బాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన బయోపిక్ రాబోతోంది. దేశ అత్యున్నత సైనిక పురస్కారం ‘పరమవీర చక్ర’ను అతి పిన్న వయసులో అందుకున్న వీర సైనికుడు, సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితం ఆధారంగా ‘ఇక్కీస్’ అనే చిత్రం తెరకెక్కుతోంది. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నంద ఈ చిత్రంలో అరుణ్ ఖేతర్‌పాల్ పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.‘అంధాధున్’ వంటి విజయవంతమైన చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న శ్రీరామ్ రాఘవన్ ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో దిగ్గజ నటుడు ధర్మేంద్ర, ‘పాతాళ్ లోక్’ ఫేం జైదీప్ అహ్లావత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విడుదలైన ట్రైలర్, 1971లో జరిగిన ఇండో-పాక్ యుద్ధ సన్నివేశాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. యుద్ధభూమిలో అరుణ్ ఖేతర్‌పాల్ చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమను ట్రైలర్‌లో ఆవిష్కరించారు.కేవలం 21 ఏళ్ల వయసులోనే దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అరుణ్ ఖేతర్‌పాల్ త్యాగాన్ని ఈ సినిమా గుర్తు చేయనుంది. ఆయన అసమాన పరాక్రమానికి గుర్తింపుగా భారత ప్రభుత్వం మరణానంతరం పరమవీర చక్ర పురస్కారంతో సత్కరించింది. ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# కొత్త గెటప్ లో ఆషికా !



ఆషికా రంగనాథ్.. ఈ హీరోయిన్ తెలుగులో చేసినవి 2 సినిమాలే అయినప్పటికీ స్టార్ హీరోయిన్ మాదిరి గుర్తింపు సంపాదించింది.. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.ఎప్పుడు పొట్టి పొట్టి బట్టలతోనో లేక ట్రెడిషనల్ డ్రెస్ లతోనో కనిపించే ఆషికా రంగనాథ్ ఒక్కసారిగా గెటప్ చేంజ్ చేసేసరికి ఈ హీరోయిన్ ఫొటోస్ చూసిన అభిమానులు సైతం షాక్ అవుతున్నారు.ఇదేంటి ఈ హీరోయిన్ గెటప్ మార్చేసింది.. ఈ కొత్త గెటప్ ఏంటో అంటూ ఆశ్చర్యపోతున్నారు.ఇక తాజాగా ఆషికా రంగనాథ్ తన ఇంస్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది.ఆ ఫొటోస్ లో ఆషికా రంగనాథ్ గెటప్ పూర్తిగా చేంజ్ అయింది. హాలీవుడ్లో పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్ అనే సినిమాలో హీరో ఎలా అయితే ఉంటారో అచ్చం ఆ హీరోని పోలి ఉన్న గెటప్ లో ఆషికా రంగనాథ్ తాజా ఫోటోలు ఉన్నాయి. తలకి బ్యాండ్ కట్టుకొని హెయిర్ లీవ్ చేసుకొని ఆషికా రంగనాథ్ ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలు చూస్తూ ఉంటే మాత్రం ఆషికా రంగనాథ్ ఏదో స్టంటులు చేసేవారు ఫోటోలకు ఫోజులు ఇచ్చినట్లుగా ఉంది. అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇక ఆషికా రంగనాథ్ పోస్ట్ చేసిన ఫోటోలలో వెనుక ఉన్న బ్యాక్గ్రౌండ్ కూడా అలాగే ఏదో యాక్షన్ మూవీ సెట్ వేసినట్టు కనిపిస్తోంది. చూస్తుంటే ఆషికా రంగనాథ్ కొత్త సినిమా కోసం అలా తన గెటప్ ని చేంజ్ చేసినట్టు కనిపిస్తోంది. మరి ఆషికా రంగనాథ్ తాజా ఫొటోస్ కొత్త సినిమా గెటప్ లో భాగమేనా అనేది తెలియాల్సి ఉంది.

ఇక ఈ ఫొటోస్ షేర్ చేయడంతో పాటు ఈ ఫొటోస్ కి క్యాప్షన్ గా ఈ మొత్తం లుక్ వెనక ఉన్న బృందానికి లవ్ యు అన్నట్లుగా ఫింగర్ హాట్ సింబల్ ఎమోజిని కూడా షేర్ చేసింది.. ప్రస్తుతం ఆషికా రంగనాథ్ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.మరి హీరోయిన్ సడెన్ గా గెటప్ చేంజ్ వెనుక కారణం ఏంటో తెలియాల్సి ఉంది.

# అలా చెప్పుకోవడం నాకు ఇష్టం ఉండదు: రవితేజ

రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో ‘మాస్ జాతర’ సినిమా రూపొందింది. శ్రీలీల కథానాయికగా నటించిన ఈ సినిమా, రేపు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీమ్ ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. తాజా ఇంటర్వ్యూలో భాను భోగవరపు మాట్లాడుతూ, “నేను రవితేజ గారి అభిమానిని. అయన సినిమాలలో నాకు ‘వెంకీ’ అంటే చాలా ఇష్టం. ఆయనతోనే నా ఫస్టు మూవీ ఉంటుందని నేను అసలు ఊహించలేదు” అని చెప్పారు. ఈ సినిమాకి ‘మాస్ జాతర’ అనే టైటిల్ పెట్టింది రవితేజ గారే. ఇది సాలిడ్ టైటిల్ కావడంతో, అందుకు తగినట్టుగా సీన్స్ ను డిజైన్ చేసుకోవడం జరిగింది. ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది” అని అన్నారు. ఇక హైపర్ ఆది మాట్లాడుతూ .. ‘ధమాకా’ తరువాత నుంచి రవితేజ గారి సినిమాలలో వరుసగా చేస్తూ వెళుతున్నాను. ఈ సినిమాలు రవితేజగారితో కలిసి నేను చేసే కామెడీ ఆడియన్స్ కి నచ్చుతుంది” అని అన్నారు. ఇక రవితేజ మాట్లాడుతూ .. “ వేరే ఏ విషయం గురించి మాట్లాడమని చెప్పినా మాట్లాడతాను. కానీ నా గురించి .. నా సినిమాను గురించి మాట్లాడటం నాకు ఇష్టం ఉండదు. ఇలా వచ్చేస్తున్నాయ్ .. అలా వచ్చేస్తున్నాయ్ .. బాగా వచ్చేస్తున్నాయ్ అన్ని నేను చెప్పలేను. భాను డైరెక్షన్ .. అతని రైటింగ్ ఈ సినిమాకి హైలైట్ గా నిలుస్తుందనేది మాత్రం నిజం. ఒకటి మాత్రం చెప్పగలను .. మనకి మరో కమర్షియల్ డైరెక్టర్ వస్తున్నాడు” అని అన్నారు.

# హైదరాబాద్‌లో ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ మరోసారి హైదరాబాద్ సంగీత ప్రియులను తన స్వరాలతో అలరించనున్నారు. నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా ఆయన భారీ లైవ్ కాన్సర్ట్ నిర్వహించబోతున్నారు. హైదరాబాద్ టాకీస్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఈ వార్తతో రెహమాన్ అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ, “హైదరాబాద్ అత్యంత డైనమిక్ నగరంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడి ప్రజలు లైవ్ కాన్సర్ట్‌లను ఎంతగానో ఆదరిస్తున్నారు. ఏఐ ప్రభావం పెరుగుతున్న ఈ రోజుల్లో కూడా ప్రేక్షకులు నిజమైన సంగీత అనుభూతి కోసం ఇలాంటి కార్యక్రమాలకు రావడం కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంది” అని అన్నారు. ఇది సంగీతం పట్ల ప్రజలకు ఉన్న ప్రేమకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్ టాకీస్ వ్యవస్థాపకుడు సాయినాథ్ గౌడ్ మాట్లాడుతూ, “ప్రేక్షకులకు ప్రపంచ స్థాయి సంగీత అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం. ఈ ఏడాది ఆరంభంలో ఎం.ఎం. కీరవాణితో కార్యక్రమం నిర్వహించాం. ఇప్పుడు రెండోసారి ఏఆర్ రెహమాన్‌ను నగరానికి తీసుకురావడం గర్వంగా ఉంది. ఈ ఈవెంట్ కోసం దీపక్ చౌదరి, ఇవా లైవ్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం” అని తెలిపారు.భారతీయ సంగీతాన్ని ప్రపంచ వేదికలపై వినిపించిన రెహమాన్, తన లైవ్ ప్రదర్శనలతో ఇప్పటికే ఎంతో మందిని మంత్రముగ్ధులను చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌లో జరగబోయే ఈ సంగీత విభావరిలో ఆయన తన కెరీర్‌లోని ఎన్నో సూపర్ హిట్ గీతాలను ప్రత్యక్షంగా ఆలపించనున్నారు. దీంతో నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీ రెహమాన్ స్వరాలతో మార్మోగడం ఖాయంగా కనిపిస్తోంది



# రష్మిక మందన్నకు మరో హిట్.. వంద కోట్ల క్లబ్ లో చేరిన బాలీవుడ్ మూవీ

పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందన్న మరో హిట్ సినిమాను తన ఖాతాలో వేసుకుంది. బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక జంటగా నటించిన హారర్ కామెడీ చిత్రం ‘థమ్మా’ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తోంది. సెప్టెంబర్ 21న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, 100 కోట్ల క్లబ్ లో చేరింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 9వ రోజు (అక్టోబర్ 29న) ఈ చిత్రం కేవలం రూ. 3.25 కోట్లు వసూలు చేసింది. దీంతో సినిమా మొత్తం వసూళ్లు రూ. 104.60 కోట్లకు చేరాయి. రెండో బుధవారం హిందీలో ఈ చిత్రానికి 10.10% ఆక్యుపెన్సీ నమోదైంది. ఉదయం షోలకు 6.28% ఆక్యుపెన్సీ ఉండగా, రాత్రి షోలకు అత్యధికంగా 13.96% నమోదైనట్లు నివేదికలు చెబుతున్నాయి.ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దినేశ్ విజన్, అమర్ కౌశిక్ మ్యాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై నిర్మించారు. ‘స్త్రీ’, ‘స్త్రీ 2’, ‘భేదియా’, ‘ముంజ్యా’ చిత్రాల తర్వాత మ్యాడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో వచ్చిన ఐదో సినిమా ఇది. ఇందులో అలోక్ గోయల్ అనే జర్నలిస్టు పాత్రలో ఆయుష్మాన్ ఖురానా నటించగా, రక్తపిశాచి (వాంపైర్) అయిన తాడక పాత్రలో రష్మిక మందన్న కనిపించింది. వీరిద్దరి మధ్య నడిచే విభిన్నమైన ప్రేమకథే ఈ సినిమా.ఈ చిత్రం తన కెరీర్‌లోని అతిపెద్ద కమర్షియల్ హిట్స్‌లో ఒకటిగా నిలవడంపై హీరో ఆయుష్మాన్ ఖురానా ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ సినిమా పిల్లలను బాగా ఆకట్టుకోవడం తనను ఎంతగానో సంతోషపరిచిందని ఆయన అన్నారు. “థమ్మాలో నాకు బాగా నచ్చిన విషయం ఏంటంటే, ఇది పిల్లలకు నచ్చడం. నా కెరీర్‌లో పిల్లలు ఇష్టపడిన మొదటి సినిమా ఇదే. ఈ సినిమాలోని స్పెషల్ ఎఫెక్ట్స్, కథనం పిల్లలకు అనుకూలంగా ఉంటాయి. నా పిల్లలకు కూడా ఈ సినిమా బాగా నచ్చింది” అని తెలిపారు. ఈ చిత్రంలో పరేశ్ రావల్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఫైసల్ మాలిక్, గీతా అగర్వాల్ శర్మ వంటి నటులు కీలక పాత్రలు పోషించారు.





# బైకర్తో శర్వా మాస్టర్ ప్లాన్!

‘చార్మింగ్ స్టార్’ శర్వానంద్ చాలా కాలంగా ఒక సాలిడ్ హిట్ కోసం గట్టిగా ట్రై చేస్తున్నాడు. ‘ఒకే ఒక జీవితం’ పర్వాలేదనిపించినా, ఆయన రేంజ్‌కు తగ్గ బ్లాక్‌బస్టర్ మాత్రం ఇంకా పడలేదు. రొటీన్ కథలు, ఫ్యామిలీ డ్రామాలు వర్కవుట్ అవ్వకపోవడంతో, శర్వా ఈసారి రూట్ మార్చినట్లున్నాడు. తన కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి, ‘బైకర్’ అనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌తో రాబోతున్నాడు.ఈ సినిమా కోసం శర్వా డెడికేషన్ నెక్స్ట్ లెవల్‌లో ఉంది. కేవలం కథ నచ్చి ఓకే చెప్పడమే కాదు, ఆ పాత్ర కోసం తనను తాను పూర్తిగా మార్చుకున్నాడు. ‘బైకర్’ లుక్ కోసం బరువు తగ్గి, చాలా లీన్‌గా తయారయ్యాడు. అంతేకాదు, ఇది రెగ్యులర్ యాక్షన్ కాదు, ‘డర్ట్ బైక్ యాక్షన్’ కావడంతో, ఏకంగా మూడు నెలల పాటు స్పెషల్ ట్రైనింగ్, డైట్, జిమ్‌తో కష్టపడ్డాడని సమాచారం.ఈ సినిమాతో అభిలాష్ రెడ్డి కంకర దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. యూవీ క్రియేషన్స్ లాంటి బడా సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండటంతో, టెక్నికల్‌గా సినిమా చాలా రిచ్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది. తెలుగు సినిమాకు ‘డర్ట్ బైక్ రేసింగ్’ అనేది చాలా కొత్త జానర్. శర్వా ఈ రిస్క్ తీసుకోవడమే ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్.అయితే, ఈ కొత్త జానర్‌ను ఆడియెన్స్‌కు కరెక్ట్‌గా ఎక్కించడానికి మేకర్స్ ఒక మాస్టర్ ప్రమోషనల్ ప్లాన్ వేశారు. ‘బైకర్’ నుంచి “ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్” పేరుతో ఒక టీజర్‌ను రెడీ చేశారు. కానీ, దాన్ని నేరుగా యూట్యూబ్‌లో వదలడం లేదు. ఇది చాలా స్మార్ట్ మూవ్. ఈ గ్లింప్స్‌ను అక్టోబర్ 31 నుంచి థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నారు. అది కూడా ఈ వారం బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి రెడీగా ఉన్న ‘బాహుబలి: ది ఎపిక్’ రీ-రిలీజ్‌తో పాటు, రవితేజ ‘మాస్ జాతర’ సినిమా షోలతో పాటు దీన్ని అటాచ్ చేశారు.